ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మెహిదీపట్నం మే 17: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జారహమత్‌బేగ్ ఖాద్రి అన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజల సమస్యలపై ఉన్నతాధికారులను కలిసి చర్చించారు. ఈ సమావేశంలో నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ ఎంఐఎం నాయకుడు జాఫర్‌ఖాన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిరంతరం కృషి

ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మెహిదీపట్నంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పలు డివిజన్‌ల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు విన్నవించారు. వర్షం కారణంగా పాడైన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు.

– మెహిదీపట్నం, మే 17

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, మే 17: ఆజామాబాద్ డివిజన్ 11కేవీ అహోబిల మఠం, సాయి బాబా టెంపుల్, జామై ఉస్మానియా, వైఎంసీఏ, అయ్యప్పటెంపుల్, శ్రీరామ్‌నగర్, అప్పో, ఇందిరానగర్, పటేల్‌నగర్, తిలక్ నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ ఎం. విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 6 నుంచి 7గంటల వరకు..

అహోబిల మఠం, సాయిబాబా టెంపుల్, జామై ఉస్మానియా ఫీడర్ పరిధిలోని ఏటీఐ, లైఫ్ ఆసుపత్రి, ఆంధ్రా బ్యాంక్, హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు..

వైఎంసీఏ, అయ్యప్పటెంపుల్, శ్రీరామ్‌నగర్, అప్పో, ఇందిరానగర్ ఫీడర్ల పరిధిలోని నారాయణగూడ బ్లడ్‌బ్యాంక్, లింగంపల్లి, నృపతుంగ కాలేజ్, పోలీసు క్వార్టర్స్, సాయిదత్తా నర్సింగ్‌హోమ్, శివాలయం, మల్లికార్జుననగర్, ఎరుకలబస్తీ, శ్రీరామ్‌నగర్, అచ్చయ్యనగర్, నారాయణగూడ వాటర్ వర్క్స్, విఠల్‌వాడి, తెలంగాణ టూరిజం, తెలుగు అకాడమీ, తిలక్‌నగర్ బ్రిడ్జి, క్రిష్ణారావు ఆసుపత్రి, ఇందిరానగర్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ..

పటేల్‌నగర్, తిలక్‌నగర్ ఫీడర్ పరిధిలోని పటేల్‌నగర్, అంబేద్కర్‌నగర్, ఆజాద్‌నగర్, దుర్గానగర్, తిలక్‌నగర్, 6 నంబర్ ఎక్స్ రోడ్, అంబర్‌పేట్ మెయిన్‌రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

మెహిదీపట్నం పరిధిలో..

మెహిదీపట్నం,మే 17 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 6 నుంచి 6.30 వరకు..

11 కేవీ నీరజాకాలనీ ఫీడర్‌లోని నీరజా కాలనీ, మహబూబ్ గార్డెన్, ఛాబ్రాఎన్‌క్లేవ్, అక్బర్ బాగ్, గ్రామర్ కాలనీ , 11 కేవీ అల్వార్ సీతారామరాజునగర్ ఫీడర్ బాలాజీనగర్, సత్యనారాయణ నగర్, క్రిష్టల్ గార్డెన్, గుడిమల్కాపూర్, హీరానగర్, సాయినగర్, పవన్ గార్డెన్, కెఆర్‌కెఎం గార్డెన్, శివబాగ్, మహేశ్‌నగర్, రూఫ్ గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు..

11 కేవీ మోతిమహల్ ఫీడర్ సమతా కాలనీ, కులీకుతుబ్ షా, జమాలి కుంట, ఎండీలైన్స్, శాతం నగర్, దుర్గానగర్, గ్రామర్ కాలనీ, వలీ కాలనీ, నదీం కాలనీ, 11కేవీ శ్రీరాంనగర్ ఫీడర్ శ్రీరాంనగర్, ఎంఐజీహెచ్, మురాద్‌నగర్ కుంట, ఆసిఫ్ నగర్ మెయిన్ రోడ్, రెహనుమా దెక్కన్, మిలన్ టాకీస్, జేబాబాగ్, ఖాజా గుల్షన్ కాలనీ, 11 కేవీ పారామౌంట్ కాలనీ ఫీడర్ పారామౌంట్ కాలనీ, పేపర్ బోర్డు, హకీంపేట్, హనుమాన్ దేవాలయం, బొలిపీటీ,అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, బాబా హోటల్, ఖబరస్తాన్1,2 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

ఉదయం 8 నుంచి 8.30 వరకు..

11 కేవీ ప్రశాంతనగర్ ఫీడర్ ఎన్‌ఆర్‌ఐ కాలనీ, కేజీఎన్ హోటల్, ప్రశాంత్‌నగర్, బాపూఘాట్, పెన్షన్ పురా, లంగర్‌హౌస్ మార్కెట్, అంబేద్కర్‌నగర్, లక్ష్మీనగర్, మిలటరీ హాస్పిటల్, ఇందిరానగర్, ఫ్లోర్ మిల్, 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ టోటల్ గ్యాస్ పెట్రోల్ పంప్, ఇందిరానగర్, ధోబీ ఘాట్, గాంధీ విగ్రహం ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు..

11 కేవీ కులీకుతుబ్‌షా టూంబ్స్ ఫీడర్ గుల్షన్ కాలనీ, సమతా కాలనీ, లక్ష్మణ్‌నగర్, డైమండ్ హిల్స్, అలిజాపూర్, 11 కేవీ ఆదిత్యనగర్ ఫీడర్ ప్రోఆగ్రో సీడ్స్, ఆదిత్యనగర్, సూర్యనగర్, ఛాబ్రా ఎన్‌క్లేవ్, మెరాజ్ కాలనీ, ఝాన్సి లక్ష్మీబాయి కాలనీ, మహబూబ్ గార్డెన్, ఝాన్సినగర్, 7 టూంబ్స్, రాఘవ కాలనీ, రాహుల్ కాలనీ, ఆడమ్స్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పట్టుకోసం పార్టీల ప్రయత్నం

● కార్వాన్‌లో 51.23 శాతం నమోదు ● ఎవరికి వరించేనో అధిక ఓట్లు

మాసాబ్‌ట్యాంక్‌లోని కార్వాన్ డీఆర్‌సీ కేంద్రాన్ని సందర్శించిన గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

అబిడ్స్, మెహిదీపట్నం, మే 17 : హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కార్వాన్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోలింగ్ శాతం పెరిగింది. పెరిగిన శాతం ఎవరికి లాభం చేకూరుతుందని రాజకీయ పరిశీలకులు అంచనాలు వేసుకుంటున్నారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలతో పోల్చినా, 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను పరిశీలించినా ఈ ఎన్నికలలో కార్వాన్ సెగ్మెంట్‌లో దాదాపు మూడు శాతం ఓట్లు అధికంగా పోలయ్యాయి. 2019 సంవత్సరం నుంచి వరుసగా జరిగిన ఎన్నికలలో పోలింగ్ శాతం క్రమ, క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఇదిలా ఉండగా ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కార్వాన్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 51.23 పోలింగ్ శాతం నమోదైంది. ఈ పార్లమెంట్ ఎన్నికలలో కార్వాన్ సెగ్మెంట్‌లో మొత్తం 3,62,411 ఓట్లు ఉండగా 51.23 శాతం నమోదై మొత్తం 1,85,681 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌ల కన్నా గోషామహల్ సెగ్మెంట్‌లో 54.72 అత్యధిక శాతం ఓట్లు పోల్ కాగా కార్వాన్ సెగ్మెంట్‌లో 51.23 శాతం ఓట్లు పోలై రెండవ స్థానంలో నిలిచింది. దీంతో కార్వాన్‌లో గత ఎన్నికల కన్నా దాదాపు మూడు శాతం ఓట్లు పెరగగా పెరిగిన ఓట్లు ఏ పార్టీకి లాభం చేకూరుతాయని పోటీకి దిగిన పలు పార్టీల అభ్యర్థులు, వారి నాయకులు ఆశలు పెట్టుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం మజ్లిస్ పార్టీకి కంచుకోట కాగా ఈ ఎన్నికలలో అత్యధిక ఓట్లను సాధించేందుకు మజ్లిస్‌తో పాటు బీజేపీ అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేయగా బీఆర్ఎస్ అభ్యర్థి మాత్రం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి లబ్ధిదారులపై ఆశ పెట్టుకుని ఓట్లు సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కార్వాన్‌లో పెరిగిన పోలింగ్ శాతం తమకు లాభం చేకూరుతుందని బీజేపీ నాయకులు చెప్పుకుంటున్నారు. మజ్లిస్ పార్టీ కూడా ఈ సెగ్మెంట్ నుంచి గత అసెంబ్లీ ఎన్నికల కన్నా అధికంగా ఓట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 19,57,772 ఓట్లు ఉండగా అందులో 44.75 శాతంతో 8,76,078 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికలలో మొత్తం 22, 17,094 ఓట్లు ఉండగా 48.48 శాతంతో 10,74,827 ఓట్లు పోలయ్యాయి.

అధికారుల సత్ఫలితాలు....

పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా కార్వాన్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోలింగ్ శాతం పెంచేందుకు గాను అధికారులు విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. ఏఆర్ఓలు శశికళ, అలేఖ్యరెడ్డి అధికారులు, సిబ్బంది ద్వారా ఓటర్లు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా అవగాహన కల్పించారు. పాఠశాలలలోని విద్యార్థుల ద్వారా తల్లి, దండ్రులకు ఓటు విలువను తెలిపేలా, కళాశాలల విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రచారాన్ని చేపట్టారు. అదే విధంగా ఇంటింటికీ జీహెచ్‌ఎంసీ సిబ్బంది 'ప్రౌడ్ టు బీ ఓటర్' స్టిక్కర్‌లను అతికించి పోలింగ్ శాతం పెంచేందుకు పాటుపడ్డారు. పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. విద్యావంతులు ఈ ఎన్నికలపై అంతగా ఆసక్తి చూపక పోగా బస్తీలకు చెందిన ప్రజలు మాత్రం ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కనబర్చారు.

గెలుపు ఓటములపై ఓట్ల లెక్కలతో విశ్లేషణలు...

పోలైన ఓట్లతో అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు గెలుపు, ఓటములపై విశ్లేషణలు కొనసాగిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల వివరాలను అధికారుల నుంచి తీసుకుని, ఏజెంట్‌ల వద్ద నమోదైన వాటితో చూసుకోవడం, ఆయా ఓట్లు ఏ పార్టీకి పడతాయనే విశ్లేషణలను చేపడుతున్నారు. గెలుపు, ఓటముల విశ్లేషణలు చేసుకుని ఎవరికి వారు తమదే గెలుపు అని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జి.వసుంధర, విజయ్‌కుమార్, కామిశెట్టి గోదాలక్ష్మి

23న అన్నమాచార్య జయంతి మహోత్సవం..

చిక్కడపల్లి,మే 17: నవ్యనాటక సమితి, అన్నమాచార్య మిషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 616 జయంతి మహోత్సవాన్ని 23న నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు వేమరాజు విజయ్‌కుమార్, కామిశెట్టి గోదాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ ఉప సంచాలకులు జి. వసుంధర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్యాగరాయగానసభలో జరిగే ఈ కార్యక్రమంలో 11 మంది నృత్యగురువులు 50 మంది శిష్యురాళ్లతో శ్రీ పదార్చణ శీర్షికతో అన్నమాచార్య సంకీర్తనలకు కూచిపూడి, భరతనాట్యం,ఆంధ్రనాట్య నృత్యరీతులలో నృత్య ప్రదర్శన ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కె.వి. రమణాచారి, ప్రముఖులు రజిత్ ఆకుల, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, పద్మిని మాచాని, పి. విజయకుమార్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త నిష్టల సుధామాల పాల్గొన్నారు.

బండి యాదగిరికి నివాళి

సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ముషీరాబాద్, మే 17: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా శుక్రవారం విప్లవ కవి బండి యాదగిరి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా పాల్గొని బండి యాదగిరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తనదైన ముద్రవేసుకున్న యాదగిరి నాటి రాజ్యహింస, ప్రజల హక్కులు, సమానత్వం కోసం విరోచిత పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్త తంగిరాల చక్రవర్తి, శ్రీధర సుబ్రహ్మణ్యం, గాయని గరిమెళ్ల సీత తదితరులు పాల్గొన్నారు.

కోఠి యూపీహెచ్‌సీలో ప్రపంచ హైపర్ టెన్షన్ డే

యూపీహెచ్‌సీలో మహిళకు బీపీ పరీక్ష చేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి

సుల్తాన్‌బజార్, మే 17 : ప్రజలు హైపర్ టెన్షన్ బారిన పడకుండా ముప్పై ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరూ బీపీ చెక్ చేయించుకోవాలని ఆర్ఎఫ్‌పీటీసీ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రపంచ హైపర్‌టెన్షన్ డేను కోఠిలోని యూపీహెచ్‌సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా 30 ఏండ్లు దాటిన వారికి ఆయన బీపీ చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరచూ తల తిరుగుతుంటే, తలనొప్పిగా అనిపిస్తేనే చాలా మంది బీపీ అని అనుకుంటారని వాస్తవంగా అందరిలో బీపీ లక్షణాలు పైకి కనిపంచవని అన్నారు. కొందరిలో మాత్రమే తల తిరగడం, తలనొప్పి, నిస్సత్తువ, కళ్లు తిరగడం, తికమక,శ్వాస సరిగ్గా తీసుకోలేక పోవడం, మూత్రంలో రక్తం పడటం, ఛాతి, మెడమీద ఎవరో సమ్మెతో కొడుతున్నట్లు వంటి లక్షణాలు కనిపిస్తాయని ఆయన వివరించారు. వేగంగా మారుతున్న జీవన శైలి, పెరిగే వయస్సు, వృత్తి ఉద్యోగాలలోని ఒత్తిడి, అనుపంశికత, అధిక బరువు, ఉప్పు ఎక్కువగా తీసుకోవడం మద్యం, ధూమపానం, శారీరక శ్రమ లోపించడం, మానసిక ఒత్తిడి ఇవన్నీ అధిక రక్తపోటుకి కారణాలని అన్నా రు. టీ, కాఫీ, శీతల పానీయాలు వంటి పదార్థాలు ఎక్కువగా తీసుకోవడంతో శరీరంలో టాక్సిన్లు పేరుకుపోయి రక్త నాళాలు మందంగా మారడం పట్ల బీపీ అత్యధికంగా పెరుగుతుందని అన్నారు. ఊబకాయం, మధుమేహం, ధీర్ఘకాలిక మల బద్ధకం వంటివి అధిక రక్త పోటుకి కారణాలు అవుతున్నాయని అన్నారు. మూత్ర పిండాల పనితీరు దెబ్బతిన్నా బీపీ రావచ్చని అన్నారు. రెనిన్ రసాయనాన్ని ఎక్కువగా ప్రసవిస్తే శరీరంలో ఉప్పు ఎక్కువగా పేరుకుపోవడంతో బీపీ పెరిగిపోతుందని అన్నారు. అల్లోపతి వైద్య విధానంలో బీపీ పెరగకుండా అణిచి వేసేందుకే మందులు ఇస్తారే తప్పా అందుకు దారితీసిన కారణం గ్రహించడం లేదని అన్నారు.

సంస్థ అభివృద్ధికి కార్మికులు కృషి

కాచిగూడ, మే 17: ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందిస్తూ సంస్థకు ఆదాయాన్ని సమకుర్చడానికి ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు కృషి చేస్తున్నట్లు కాచిగూడ డిపో మేనేజర్ టి. రఘు అన్నారు. ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, సూపర్‌వైజర్లు సంస్థ అభివృద్ధి కోసం అత్యధిక ఆదాయాన్ని తీసుకొచ్చిన సందర్భంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు డిపో మేనేజర్ రఘు వారికి స్వీట్లు పంపిణీ చేశారు.

గుడి పూజారులకు గౌరవ వేతనాలు

గోల్నాక, మే 17 : నియోజకవర్గంలోని పలు గుడులలో ప్రతి రోజూ దూపదీప, నైవేద్యం సమర్పిస్తున్న పేద పూజారులకు ప్రతి నెలా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గౌరవ వేతనం అందజేస్తున్న విషయం తెలిసిందే.. శుక్రవారం గోల్నాక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెలకు సంబంధించి 11 మంది పూజారులకు రూ. 5 వేల చొప్పున మొత్తం రూ.55 వేలు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అందజేశారు. ఈ సందర్భంగా పూజారులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

తిరుమల స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కుటుంబ సభ్యులతో కలిసి కలియుగ ప్రత్యేక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట ఆయన సతీమణి సరోజ, కుటుంబ సభ్యులు అశ్విని, విహాన్, నియోజకవర్గం మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ దంపతులు, పార్టీ నాయకులు కిరణ్, చంద్రశేఖర్ ఉన్నారు. – చిక్కడపల్లి, మే 17

వరద నీరు వెళ్లేలా ట్రాఫిక్ పోలీసుల చర్యలు

పోలీసుల పనితీరు భేష్ అంటున్న వాహనదారులు

భారీ వర్షాలకు నగర రోడ్లు పూర్తిగా జల మయమయ్యాయి. దీంతో రహదారులపై నీరు నిలిచి ట్రాఫిక్ సమస్య జఠిల మవుతున్నది. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి చెట్లు విరిగి పడటం, వరదనీటి ప్రవాహం పెరగడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ విషయాన్ని గమనించిన సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తన సిబ్బందితో కలిసి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అంతే కాకుండా రోడ్లపై విరిగిపడిన చెట్లను జేసీబీ సహాయంతో తొలగించి ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసు కున్నారు. దీంతో వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల చొరవను ప్రత్యేకంగా అభినందించారు.

– సుల్తాన్‌బజార్, మే 17

రోడ్లపై పేరుకుపోయిన బురద.. తొలగింపజేసిన కార్పొరేటర్

బతుకమ్మకుంటలో బురద, మట్టిని తొలగింపజేయిస్తున్న బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మారెడ్డి

అంబర్‌పేట, మే 17 : గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంట, సాయిమధురానగర్‌లో రోడ్లపై స్థానికులు నడవడానికి వీలు లేకుండా బురద పేరుకు పోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ బి. పద్మ, సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి శుక్రవారం ఆ బస్తీలకు వెళ్లారు. బాబ్‌కాట్ మిషన్ తెప్పించి రోడ్లపై నిండిన బురద, మట్టి, చెత్తను తొలగింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో ఎక్కడ మట్టి, చెత్త, బురద పేరుకుపోయినా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, లక్ష్మణ్, సుధాకర్, శానిటరీ సూపర్‌వైజర్ హరినాథ్, బీఆర్ఎస్ నాయకులు శేఖర్, సునీల్, రమేశ్, గోవిందు అర్జున్, వెంకటరమణరాజు, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు గ్యారెంటీ పథకం ఇవ్వాలి

కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ

సుల్తాన్ బజార్, మే 17 : సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇస్తున్న ఆరు గ్యారెంటీల పథకాల తరహాలో ఉద్యోగుల కోసం ఒక్క గ్యారెంటీ పథకం ఇవ్వాలని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని జిల్లా శాఖ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహిస్తూ చనిపోయిన ఉద్యోగుల ఆత్మ శాంతి కోసం ఒక్క నిమిషం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏలను, 2023 పీఆర్‌సీ, హెల్త్ కార్డ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్, సరెండర్ లీవ్స్ బిల్లులతో పాటు ఉద్యోగుల సమస్యలపై చర్చించడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా శాఖ పరిధిలోని 45 యూనిట్ల అధ్యక్ష,కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు ఈ నెల 22న టీఎన్జీవో కేంద్ర సంఘ కార్యవర్గ సమావేశంలో డాక్టర్ ముజీబ్‌హుస్సేనీని ప్రధాన కార్యదర్శిగా నియమించాలని ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కేతర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఉమర్‌ఖాన్, కురాడి శ్రీనివాస్, నరేశ్‌కుమార్, హరిబాబు పాల్గొన్నారు.

హైపర్ టెన్షన్‌పై అవగాహన

హైపర్ టెన్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కీర్తికర్‌రెడ్డి తదితరులు

కాచిగూడ,మే 17: వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా టీఎక్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైపర్ టెన్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీఎక్స్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ కీర్తికర్‌రెడ్డి, డాక్టర్లు సరత్‌చంద్ర, సుమీత్ సిన్హా, దీపక్‌సహా, జె.శశి, పృథ్వీ, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం నాయకుడిపై పీఎస్‌లో ఫిర్యాదు

సుల్తాన్‌బజార్, మే 17 : ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి మాధవీలతపై దుర్భాషలాడిన ఏఐఎంఐఐం యాకుత్‌పురా ఇన్‌చార్జి యాసర్ ఆరాఫత్‌పై సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు, అడ్వకేట్ కొంగళ్ల నవీన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారికి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా మధ్యాహ్నం యాకుత్‌పురాలో బూత్‌లను పర్యవేక్షించేందుకు వచ్చిన మాధవీలతపై యాసన్ అరాఫత్ వంద మంది అనుచరులతో కలిసి నోటికి వచ్చినట్లు దుర్భాషలాడాడని అన్నారు.144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ యథేచ్ఛగా వంద మంది అనుచరులతో పోలింగ్ బూత్‌లోకి చొరబడి రిగ్గింగ్ చేశారని అన్నారు. జీత్ జైశ్వాల్, ఓం సింగ్, కాంచన జోషి, ప్రావిజైన్, అనిల్ బజాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డిని యూనియన్ కార్యాలయంలో సన్మానించిన ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్

మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్‌కు తెలంగాణ ప్రభుత్వం మద్దతు

అబిడ్స్, మే 17 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్, ఐఎన్‌టీయూసీ, జీహెచ్‌ఎంసీ ఉద్యోగులందరికీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీకి అనుబంధంగా ఉన్న మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంయూ, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ చిన్నారెడ్డిని సన్మానించారు. అనంతరం ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ 625 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉందని, ఐదు వేల మంది శాశ్వత ఉద్యోగులు, 28,000 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, కార్మికులందరికీ నెలకు రూ.26 వేల వరకు వేతనం పెంపు, పాత పెన్షన్ విధానం అమలు డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, సురేశ్ మహ్మద్, రఫీ, జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని అమ్ముతున్న యువకునిపై కేసు నమోద